
సాక్షి ఏలూరు

గురువారం । 25 । ఏప్రిల్ । 2024



మహాలక్ష్మిగా రాట్నాలమ్మ

రాట్నాలకుంటలో రాట్నాలమ్మ తిరునాళ్లలో భాగంగా బుధవారం అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. 8లో ▸



వలసల వరద

ఎన్నికల సమీపిస్తున్న సమయంలో వైఎస్సార్‌సీపీలో చేరికలు మరింత జోరందుకున్నాయి. ఇతర పార్టీల నేతలు భారీగా వచ్చి చేరుతున్నారు. 8లో ▸



నగదు పట్టివేత

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా వాహన తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఉంగుటూరులో రూ.95 వేల నగదు పట్టుకున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

ప్రత్యేక పోలీస్ అబ్జర్వర్‌గా శ్రీధర్



కలెక్టర్‌ను కలిసిన పోలీస్ అబ్జర్వర్

ఏలూరు(మెట్రో): ఎన్నికల సంఘం ద్వారా ఏలూరు జిల్లా ప్రత్యేక పోలీస్ అబ్జర్వర్‌గా నియమితులైన కర్ణాటకకు చెందిన ఐపీఎస్ అధికారి పి.శ్రీధర్ బుధవారం కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను ఏలూరు కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడంతో పాటు ప్రజలంతా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను కలెక్టర్‌ను శ్రీధర్ అడిగి తెలుసుకున్నారు. అక్రమ మద్యం నియంత్రణ, రాజకీయ పార్టీలు ప్రజలను ప్రలోభపరచకుండా పటిష్ట చర్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సూచించారు.

వైఎస్సార్‌సీపీ అదనపు పరిశీలకుల నియామకం

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏలూరు జిల్లాలో అదనపు పరిశీలకుల నియామకం చేపట్టారు. ఏలూరు జిల్లా చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ అదనపు పరిశీలకులుగా గోరుముచ్చు గోపాల్ యాదవ్, మామిళ్లపల్లి జయప్రకాష్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోండి

ఏలూరు(మెట్రో): ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్‌ని వినియోగించుకోవాలని, ఫారం-12 సమర్పణకు ఈనెల 26 చివర రోజు అని జిల్లా జేఏసీ చైర్మన్ ఏపీ ఎన్‌జీవోస్ జిల్లా సంఘ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు తెలిపారు. ఉద్యోగులంతా ఏ నియోజకవర్గంలో ఓటు ఉన్నా వారు పనిచేస్తున్న నియోజకవర్గ ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్లు వేయడానికి వీలుగా ఫెసిలిటేషన్ సెంటర్లు పార్లమెంట్ నియోజకవర్గ పరిధి లోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ ఆర్వో కార్యాలయాల్లో ఏర్పాట్లు చేయాలని కోరారు. మే 5న పోస్టల్ బ్యాలెట్ కార్యక్రమంలో ఉద్యోగులు హాజరవడానికి వీలుగా స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. ఫారం-12ను అందించడంలో సాంకేతిక, ఇతర ఇబ్బందులుంటే ఎన్జీఓ సంఘ కార్యాలయాన్ని, కార్యవర్గ సభ్యులని సంప్రదించాలని కోరారు ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని అభ్యర్థించారు.

77,515 టన్నుల ధాన్యం సేకరణ



బి.లావణ్యవేణి, జేసీ

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో ఇప్పటివరకు 6,222 మంది రైతుల నుంచి రూ.161 కోట్ల విలువైన 77,515 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. బుధవారం ఆమె వివరాలు వెల్లడించారు. ఇప్పటివరకు 12,695 మంది రైతులకు చెందిన 1,06,056 టన్నుల ధాన్యం నమోదు చేసుకున్నారన్నారు.

ప్రశాంతంగా టీసీసీ పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు బుధవారం కొనసాగాయి. డ్రాయింగ్ లోయర్ పరీక్షకు 33 మందికి గాను 15 మంది, హయ్యర్ పరీక్షకు 11 మందికి 8 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈఓ ఎస్.అబ్రహం ప్రకటనలో తెలిపారు.

వర్జీనియా అ'ధర'హో

జంగారెడ్డిగూడెం: వర్జీనియా పొగాకు ధర కిలో రూ.287కు చేరుకుంది. గతేడాది అత్యధికంగా రికార్డు స్థాయిలో రూ. 288 పలికింది. ఈ ఏడాది పొగాకు వేలం ప్రారంభమైన కొద్దిరోజులకే రూ.287కు చేరింది. మార్చి 6న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల్లో వేలం ప్రారంభమైంది. ప్రారంభ ధర కిలోకు రూ.240 లభించింది. ఇది క్రమేపీ పెరుగుతూ ఈనెల 20న రూ.266, 22న రూ.272కు చేరుకోగా, బుధవారం మరింత పెరిగింది. కొయ్యలగూడెం, గోపాలపురం వేలం కేంద్రాల్లో కిలోకు రూ.287 లభించగా, జంగారెడ్డిగూడెం-1వ కేంద్రంలో రూ.286, జంగారెడ్డిగూడెం-2వ కేంద్రంలో రూ.281, దేవరపల్లి కేంద్రంలో రూ.279 ధర లభించింది. రానున్న రెండు రోజుల్లో రూ.288 దాటి రికార్డు బ్రేక్ చేస్తుందని రైతులు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు. కిలో రూ.300కు వెళుతుందని అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉంటే లోగ్రేడ్, మధ్యతరగతి గ్రేడ్ పొగాకుకు ధర బాగుందని, వెంటనే బేళ్లు వేలం కేంద్రాలకు తరలించి అమ్ముకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఏలూరు టీడీపీ అభ్యర్థిపై పేకాట, ఫోర్జరీ, చీటింగ్ కేసులు.. నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథిపై విదేశీ నగదు మార్పిడి ఘటనలో ఫెమా చట్టం కింద కేసు నమోదు.. ఇక ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు.. ఫైనల్‌గా దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేనిపై లెక్కకు మించి రికార్డు స్థాయిలో కేసులు.. రాష్ట్రంలోనే అత్యధిక కేసులు ఉన్న అభ్యర్థిగా చింతమనేని సరికొత్త రికార్డు. వీరంతా ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో కూటమి పార్టీల నుంచి పోటీ చేస్తున్న నేతలు. ఎన్నికల అఫిడవిట్‌లో ప్రతిఒక్కరూ కేసుల చిట్టాను సమర్పించారు.

కూటమి నేతలపై క్రిమినల్ కేసులు



- 93 కేసుల రికార్డుతో చింతమనేని రాష్ట్రంలో నంబర్‌వన్
- పేకాట, ఫోర్జరీ కేసుల్లో బడేటి చంటి
- విదేశీ నగదు మార్పిడి కేసులో కొలుసు పార్థసారథి
- పుట్టా మహేష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు
- పొత్తుల నేతలపై కేసులు ఘనం

సాక్షిప్రతినిధి, ఏలూరు: ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో టీడీపీ, బీజేపీ అభ్యర్థులపై కేసులు కోకొల్లలుగా ఉన్నాయి. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు వివాదరహితులు, సచ్ఛీలురుగా ఉండాలనదే ప్రజల ఆకాంక్ష. ఇక కూటమి అభ్యర్థులు ఇదే రీతిలో విస్తృతంగా ఆటోలు పెట్టి, ఇంటింటికి తిరిగి మరీ మేం చాలా మంచివాళ్లం.. మాకే ఓటు వేయండి అంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఎన్నికల నామినేషన్ల సందర్భంగా ప్రతిఒక్కరూ సమర్పించే అఫిడవిట్‌లో కేసుల చిట్టాను చూసి అందరూ అవాక్కవుతున్నారు. ఇవేమీ ప్రభుత్వ కక్ష సాధింపుతో గడిచిన ఐదేళ్లల్లో పెట్టిన కేసులు కూడా కాదు. అన్నీ అంతకుముందే వారి వ్యాపార, క్రిమినల్, స్వభావాల రీత్యా నమోదైన కేసులు.

కేసుల్లో చింతమనేని టాప్

దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేనిపై 93 కేసులు నమోదయ్యాయి. బహుశా రాష్ట్రంలోనే ఈ స్థాయిలో కేసులు నమోదైన అభ్యర్థులు ఎవరూ లేకపోవడంతో అత్యధిక కేసులతో పాటు రౌడీషీట్ ఉన్న అభ్యర్థిగా చింతమనేని రికార్డుకెక్కారు. మాజీ మంత్రి వట్టి వసంత్‌కుమార్‌పై దాడి కేసులో రెండేళ్ల జైలు శిక్ష కూడా పడింది. అప్పీలుకు వెళ్లి ప్రస్తుతం కోర్టులో కొనసాగుతుండటంతో ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. కొల్లేరులో అటవీ శాఖాధికారులు, ముసునూరులో తహసీల్దార్ వనజాక్షి, దెందులూరు నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ అడ్డుకున్నారని మైనింగ్ ఉద్యోగులు, ట్రాఫిక్ పోలీసులు, సిటీ పోలీసులు, సాధారణ పౌరులు ఇలా లెక్కకు మించి చింతమనేని బాధితులు ఉండటంతో అదే సంఖ్యలో కేసులు కూడా నమోదయ్యాయి.

అట్రాసిటీ కేసులో పుట్టా మహేష్

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఏలూరు టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్ ఉన్నారు. వైఎస్సార్ కడప జిల్లా చాపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో చిన్నగురివిగాల ఎల్లయ్యను కులం పేరుతో దూషించి తీవ్ర స్థాయిలో బెదిరించారు. ఇది 2014లో జరిగిన ఘటన, 103/2014 నంబరుతో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఎల్లయ్యను బెదిరించిన ఆడియో తీవ్రస్థాయిలో వైరల్ అయింది. అసభ్యపదజాలంతో దూషిస్తూ మాట్లాడటం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పేకాట కేసుల్లో బడేటి చంటి

ఏలూరు తెలుగుదేశం అభ్యర్థి బడేటి చంటి పేకాటలో ప్రముఖ వ్యక్తి. ఏలూరు చుట్టుపక్కల జిల్లాలే కాకుండా విశాఖ వెళ్లి ఆడుతుంటారు. ఈ క్రమంలోనే భీమిలిలో రెండేళ్ల క్రితం పేకాడుతూ పట్టుపడ్డారు. 66/2022 నంబరుతో కేసు నమోదైంది. అలాగే ఏలూరులో సీసీ 254/2022 నంబరుతో ప్రైవేటు కేసు నమోదైంది. ఫోర్జరీ, చీటింగ్ సెక్షన్లు నమోదు చేసిన కేసు కోర్టులో విచారణ కొనసాగుతుంది.

విదేశీ నగదు మార్పిడి కేసులో పార్థసారథి

మాజీ మంత్రి, నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథిపై మూడు కేసులు ఉన్నాయి. ఘంటసాల, విజయవాడ పోలీస్‌స్టేషన్లల్లో రెండు చిన్నపాటి కేసులు నమోదయ్యాయి. ఇక విదేశీ నగదు మార్పిడి కేసులో ఫెమా చట్టం కింద కేసు నమోదైంది. అది కూడా 22 ఏళ్ల క్రితం నమోదైన కేసు. హైదరాబాద్‌లోని స్పెషల్ ఎకానమీ అఫెన్స్ కోర్టులో సీసీ 69/2002, సీసీ 99/2002 నంబర్లతో కేసు నమోదైంది. 69/2002 కేసులో రూ.5 వేలు జరిమానా విధించగా, 99/2002లో రెండు నెలల సాధారణ జైలు శిక్ష, రూ.10 వేలు జైలు శిక్ష విధించారు. దీనిపై సుప్రీంకోర్టు నుంచి స్టే తెచ్చుకుని రాజకీయాల్లో కొనసాగుతున్నారు.

2,129 సువిధ అభ్యర్థనల

పరిష్కారం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ఏలూరు (మెట్రో): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈఎస్ఎంఎస్ కింద చేపట్టిన సీజర్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ ద్వారా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి జిల్లావ్యాప్తంగా రూ.13.74 కోట్ల విలువైన నగదు, బంగారం, మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఇందులో రూ.206.35 లక్షల నగదు కాగా, రూ.10.17 కోట్ల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, రూ.143.24 లక్షల విలువైన మద్యం స్వాధీనపరుచుకున్నామన్నారు. అలాగే జిల్లాలో ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ /ఎన్ కోర్ ద్వారా అందిన అభ్యర్థనల్లో ఇప్పటివరకు 2,129 అనుమతులు ఇచ్చామన్నారు. ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ ద్వారా 2,167 అభ్యర్థనలు రాగా 2,129 అనుమతులు జారీ చేశామని, మరో 38 పరిశీలనలో ఉన్నాయన్నారు. సీ-విజిల్ ద్వారా 410 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. అలాగే మీడియాలో ఎన్నికల ఉల్లంఘనలకు వచ్చిన 106 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. ఎన్‌జీఎస్పీ పోర్టల్ ద్వారా 643 ఫిర్యాదులు స్వీకరించగా వాటిలో 638 పరిష్కరించామని, మరో 5 పరిశీలనలో ఉన్నాయన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున్న ప్రజలు నగదు గాని ఇతర విలువైన వస్తువులను ప్రయాణ సమయంలో తీసుకువెళ్లే సమయంలో సరైన ఆధార పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు.

మళ్లీ ఎగిరేది వైఎస్సార్‌సీపీ జెండానే..

ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని



ఏలూరు ఫిరంగులదిబ్బలో వృద్ధురాలికి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడబోతుందనీ.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారనీ.. ఏలూరులోనూ ఎగిరేది వైఎస్సార్‌సీపీ జెండానే అని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు 23వ డివిజన్‌లో బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే నాని ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. 23వ డివిజన్ కార్పొరేటర్ కలవకొల్లు సాంబ ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. మేయర్ షేక్ నూర్జహాన్‌తో కలిసి ఫిరంగులదిబ్బ, లాయర్ రోనాల్డ్‌రాజు ఇంటి రోడ్డు, శాంతినగర్ 9వ రోడ్డు, ఫిరంగుల దిబ్బ రామాలయం ప్రాంతాల్లో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఐదేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చూసి ఓట్లు వేయాలని కోరారు. వృద్ధులను, చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తూ, మహిళలు, యువతకు సంక్షేమ పథకాలు వివరిస్తూ ముందుకు సాగారు. ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గంలో ప్రజలకు సంక్షేమాన్ని పక్కాగా అందించామనీ, అభివృద్ధి పనులు చేసి చూపించామని చెప్పారు. ఏలూరు నగరంలోని 76 వేల కుటుంబాలకు చెందిన సుమారు 1.86 లక్షల మందికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందన్నారు. నియోజకవర్గంలో సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు సుమారు రూ.447 కోట్లను అందించామన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. ఇడా చైర్మన్, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, కో-ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, కార్పొరేటర్లు, పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

అట్టహాసంగా రాజ్యలక్ష్మి నామినేషన్



కేఆర్‌పురంలో ఆర్‌ఓకు నామినేషన్ పత్రాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి. చిత్రంలో ఎమ్మెల్యే బాలరాజు, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్

బుట్టాయగూడెం: వైఎస్సార్‌సీపీ పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తెల్లం రాజ్యలక్ష్మి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. కేఆర్‌పురం ఐటీడీఏలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్, పార్టీ పోలవరం నియోజకవర్గ పరిశీలకుడు జెట్టి గురునాథరావు, పోలవరం నియోజకవర్గ చీఫ్ ఎలక్షన్ ఏజెంట్, రాష్ట్ర అతిరాసుల కార్పొరేషన్ చైర్మన్ ఇళ్లా భాస్కరరావుతో కలిసి ఆమె మూడు సెట్ల నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజకు అందజేశారు. అలాగే ఎమ్మెల్యే బాలరాజు కూడా రెండు సెట్ల నామినేషన్లను సమర్పించారు.

జగనన్న ఆశీర్వాదంతో..

నామినేషన్ వేసిన అనంతరం రాజ్యలక్ష్మి విలేకరులతో మాట్లాడారు. సీఎం జగనన్న ఆశీర్వాదం తనకు సంపూర్ణంగా ఉందన్నారు. ప్రజల ఆశీస్సులతో ఎన్నికల్లో విజయం సాధించి ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తాననన్నారు. సీఎం జగన్ సహకారంతో తన భర్త ఎమ్మెల్యే బాలరాజు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారన్నారు. సీఎం జగన్ పాలనలో ఎక్కడా అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలను ప్రజలందరికీ అందించారన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్న గెలిస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆమె అభ్యర్థించారు. ముందుగా ఆమె భర్త బాలరాజు కాళ్లకు దండం పెట్టి వెళ్లి నామినేషన్ సమర్పించారు.

పోలింగ్ రోజు సెలవుకు వినతి

ఏలూరు (టూటౌన్): ఎన్నికల పోలింగ్ రోజున అసంఘటిత కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని ఏపీ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బొజ్జా రామకృష్ణ బుధవారం ప్రకటనలో కోరారు. ప్రైవేటుగా ఎలక్ట్రికల్ పనులతో జీవనం సాగించే తాము అసంఘటిత రంగ కార్మికులుగా బీఓసీలో రిజిస్ట్రేషన్ అయ్యామని పేర్కొన్నారు. తాము ఓటుహక్కు వినియోగించుకునేలా వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. బీఓసీ బోర్డులో రిజిస్టర్ అయిన ప్రతి కార్మికుడికి పోలింగ్ రోజున రూ.1,000 చొప్పున వారి బ్యాంకు ఖాతాలో జమచేయాలని కోరారు.

ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయొచ్చు



ఎస్‌పి రామన్

ఏలూరు(మెట్రో): జిల్లాలోని కైకలూరు, చింతలపూడి, పోలవరం, నూజివీడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల సాధారణ పరిశీలకులుగా తమిళనాడుకు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి, తమిళనాడు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ఎస్‌పి రామన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై తనను నేరుగా కలిసి లేదా 9154690377 ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎన్నికల సమయంలో ఓటర్లను వివిధ రాజకీయ పార్టీలు ఎటువంటి ప్రలోభాలకు లోనుచేయకుండా, ప్రజలంతా స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పర్యవేక్షిస్తామన్నారు. ఏలూరు కలెక్టరేట్ సమీపంలోని రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో తాను బస చేస్తున్నానని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ఉల్లంఘనలు, శాంతి భద్రతలు తదితర ఎన్నికల విషయాలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఉదయం 11 గంటలలోపు లేదా సాయంత్రం 5 గంటల తర్వాత తనను నేరుగా కలిసి సమాచారం ఇవ్వవచ్చని చెప్పారు.

నేడు ప్రవేశ పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గురుకుల విద్యాలయాల్లో 5,6,7,8 తరగతుల్లో ప్రవేశాలకు ఏపీఆర్ఎస్ కామన్ అడ్మిషన్ టెస్ట్, ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఏపీఆర్‌జేసీ, డిగ్రీ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు డీసీ సెట్ పరీక్షలు గురువారం నిర్వహించనున్నట్లు డీఈఓ ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీఆర్ఎస్ టెస్ట్ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, ఏపీఆర్‌జేసీ, డీసీ సెట్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరుగుతాయన్నారు. ఏపీఆర్ఎస్ టెస్ట్‌కు 2,185 మంది, ఏపీఆర్‌జేసీకి 1,908 మంది, డీసీ సెట్‌కు 66 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. ఏలూరులో 10 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

తుది దశకు నామినేషన్ల ఘట్టం

నేటితో గడువు పూర్తి

ఏలూరు (మెట్రో): సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల దాఖలు ప్రక్రియ తుది దశకు చేరుకుంది. గురువారంతో నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగియనుంది. బుధవారం జిల్లాలో పార్లమెంట్ నియోజకవర్గానికి 5, అసెంబ్లీ నియోజకవర్గాలకు 35 నామినేషన్లు దాఖలయ్యాయి. పోలవరం అసెంబ్లీ నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి నామినేషన్ దాఖలు చేశారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గానికి యువతరం పార్టీ అభ్యర్థిగా గుగులోతు బాబు ఒక సెట్టు, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా బైరబోయిన మాల్యాద్రి ఒక సెట్టు, బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిగా నిట్టా అఖిల ధరణి పాల్ ఒక సెట్టు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా గొడుగుపాటి వీరరాఘవులు ఒక సెట్టు, తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పుట్టా మహేష్‌కుమార్ ఒక సెట్టు నామినేషన్లు దాఖలు చేశారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా..

- ఉంగుటూరు నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా పుప్పాల శ్రీనివాసరావు, పుప్పాల ఆదివల్లి రమణి ఒక్కో సెట్టు, స్వతంత్ర అభ్యర్థిగా నేకూరి ఆశీర్వాదం ఒక సెట్టు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోట్ల ధర్మరాజు ఒక సెట్టు, సమర్పించారు.
- దెందులూరు నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా కొఠారు అబ్బయ్యచౌదరి, కొఠారు రామచంద్రరావు 2 సెట్లు చొప్పున, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆలపాటి నరసింహమూర్తి, స్వతంత్ర అభ్యర్థులుగా నూతి రవీంద్ర, నూతి నాగరాజు, పచ్చిగోళ్ల జాన్ ధర్మరాజు, చెరుకూరి శ్రీరామ్‌కుమార్ ఒక్కో సెట్టు నామినేషన్ సమర్పించారు.
- ఏలూరు నియోజకవర్గానికి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా అల్లూరి సత్యనారాయణ రాజు, బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిగా ఆండుగుల రతన్‌కాంత్, స్వతంత్ర అభ్యర్థిగా రాజనాల శ్రీనివాసరావు ఒక్కో సెట్టు నామినేషన్ దాఖలు చేశారు.
- పోలవరం నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా తెల్లం రాజ్యలక్ష్మి 3 సెట్లు, తెల్లం బాలరాజు 2 సెట్లు, జనసేన అభ్యర్థిగా చిర్రా బాలరాజు, స్వతంత్ర అభ్యర్థిగా కొవ్వాసి జగదీశ్వరి ఒక్కో సెట్టు నామినేషన్ సమర్పించారు.
- చింతలపూడి నియోజకవర్గానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థులుగా సొంగా రోషన్‌కుమార్ 2 సెట్లు, సొంగా ఇస్సాక్ రాజ్ ఒక సెట్టు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఉన్నమట్ల రాకడ ఎలిజా, స్వతంత్ర అభ్యర్థులుగా తొర్లపాటి శ్రీనివాసరావు, వెంప దుర్గారావు, కలపాలి ప్రసాద్ ఒక్కో నామినేషన్ చొప్పున దాఖలు చేశారు.
- నూజివీడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా కొలుసు పార్థసారథి ఒక సెట్టు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మరీదు కృష్ణ ఒక సెట్టు, స్వతంత్ర అభ్యర్థులుగా పాము రవీంద్రనాథ్ మూడు సెట్లు, చలిగంటి వెంకటేష్ ఒక సెట్టు నామినేషన్ సమర్పించారు.
- కైకలూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా దూలం నాగేశ్వరరావు, దూలం వీర కుమారి రెండు సెట్లు, తిరువీధుల శారద ఒక సెట్టు, భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా కామినేని శ్రీనివాస్ రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థులుగా గునుకుల నారాయణ, తిరువీధుల శారద, బొద్దు కిరణ్‌కుమార్ ఒక్కో సెట్టు నామినేషన్ దాఖలు చేశారు.

క్లుప్తంగా

మహాలక్ష్మి అలంకరణలో రాట్నాలమ్మ



మహాలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిస్తున్న రాట్నాలమ్మవారు

పెదవేగి: రాట్నాలకుంట గ్రామంలోని వేంచేసి యున్న శ్రీరాట్నాలమ్మ దేవస్థానంలో అమ్మవారి తిరునాళ్లు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు బుధవారం అమ్మవారు మహాలక్ష్మిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తిరునాళ్లలో భాగంగా ఆలయంలో ఉదయం 6 గంటలకు విఘ్నేశ్వర పూజ, నవగ్రహ, మండపార్చన, కుంకుమార్చనలు జరిగాయి. 8 గంటలకు సామూహిక లక్ష కుంకుమార్చన, లలితా త్రిపురసుందరి హోమం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి కుంకుమార్చన, మంగళహారతి మంత్రపుష్పం, ప్రసాదవితరణ చేశారు. రాత్రి 7 గంటలకు పుష్పయాగోత్సవం కార్యక్రమాన్ని దేవస్థానం అధికారులు కన్నులపండుగగా జరిపించారు. సాయంత్రం 6 గంటలకు కూచిపూడి అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాత్రి 8 గంటలకు సత్య అర్కెస్ట్రా అత్తిలి సినీ మ్యూజికల్ నైట్ ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచారయత్నం కేసులో వ్యక్తికి ఐదేళ్ల జైలు

ఏలూరు (టూటౌన్): వివాహితపై అత్యాచారయత్నానికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.1,500 జరిమానా విధిస్తూ ఏలూరు ఐదో అదనపు జిల్లా జడ్జి, మహిళా కోర్టు న్యాయమూర్తి జి.రాజేశ్వరి బుధవారం తీర్పు వెలువరించారు. ఏపీపీ డీవీ రామాంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం మండలం బలుసుగొయ్యిపాలెంకు చెందిన దొంగ రమేష్ 2017 సెప్టెంబర్ 10న మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న వివాహితపై దాడి చేసి అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రాగా నిందితుడు దొంగ రమేష్ పరారయ్యాడు. దీనిపై బాధితురాలు, కుటుంబ సభ్యులు గ్రామ పెద్దలకు మొరపెట్టుకున్నారు. నిందితుడు పెద్దల వద్ద పంచాయితీకి రాకపోవడంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై వీరవాసరం పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఎస్సై ఎస్.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణకు వీరవాసరం ఎస్సై పి.రమేష్, కోర్టు కానిస్టేబుల్ వి.ఏసుబాబు, నానిబాబు సహకరించారు. కోర్టులో ఏపీపీ డీవీ రామాంజనేయులు వాదనలు వినిపించారు.

పేదల సంక్షేమమే జగన్ అజెండా

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- తణుకు 13వ వార్డులో ఎన్నికల ప్రచారం

తణుకు అర్బన్ : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతాయని ప్రజలు నమ్ముతున్నారని తణుకు ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఇరగవరం కాలనీలోని 13వ వార్డులో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు మూడు పార్టీల పొత్తుతో ప్రజల్ని మాయచేసేందుకు మీముందుకు వస్తున్నాడని ప్రజలు నమ్మవద్దన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజలతోనే పొత్తు పెట్టుకుని దేవుడి ఆశీర్వచనాలతో మీమధ్యకు వస్తున్నారని అన్నారు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ సంక్షేమం ఎందుకు ఇవ్వలేకపోయాడని, జగనన్న ఇచ్చిన తరువాత ఇప్పుడు నేను కూడా ఇస్తానని చెప్పడాన్ని ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. ప్రజాక్షేత్రంలో ప్రజలకు ఏం మంచి చేశాడని చెబుతాడని, ఏమీ చెప్పలేని స్థితిలో దత్తపుత్రుడితో కలిసి జగనన్నను దూషించడమే పనిగా పెట్టుకున్నాడని విమర్శించారు. పేదలకు మంచి చేసినందుకు ముఖ్యమంత్రిని అనరాని మాటలు అంటున్నారని ప్రజలు గమనిస్తున్నారని స్పష్టం చేశారు. ఓటు అడిగేందుకు ప్రజల మధ్యకు వస్తుంటే జగనన్నకు నీరాజనాలు పడుతున్నారని, చేసిన మంచి ఎక్కడకు పోదనడానికి ఇదే నిదర్శనమని అన్నారు. పేదల శ్రేయస్సు కోసం చంద్రబాబు లాంటి పెత్తందార్లతో పోరాడుతున్న మీ జగనన్నకు అండగా నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు పాట్ల సురేష్, నత్తా భాను, సామంతుల అప్పారావు, దొరబాబు, దిడ్ల సత్యానందం, నత్తా గంగవర్ధనరావు, అప్పన్న, కుడుపూడి చంద్రరావు, అనపర్తి జయరాజు తదితరులు పాల్గొన్నారు.



తణుకు 13వ వార్డు ప్రచారంలో వృద్ధురాలిని ఆప్యాయంగా పలుకరిస్తున్న మంత్రి కారుమూరి

వేకువజామున ఓటర్లతో మమేకం



నమాజ్ చేసుకుని వస్తున్న ముస్లింలతో విజయరాజు మాటామంతి

వాకింగ్ విత్ కేవీఆర్ పేరుతో వైఎస్సార్ సీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కె.విజయరాజు వినూత్న ప్రచారం

చింతలపూడి: వాకింగ్ విత్ కేవీఆర్ పేరుతో వైఎస్సార్ సీపీ చింతలపూడి అసెంబ్లీ అభ్యర్థి కంభం విజయరాజు వినూత్న ప్రచారంతో ముందుకు దూసుకువెళుతున్నారు. బుధవారం వేకువజామున పట్టణంలో మార్నింగ్ వాక్ చేస్తూ హల్‌చల్ చేశారు. టీషాపులు, కిళ్లీ దుకాణాల వద్ద ఆగి ప్రజలతో సరదాగా టీ తాగుతూ చిట్‌చాట్ చేశారు. పట్టణంలో సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజలు సంక్షేమ ఫలాలు పొందాలన్నా, ప్రశాంతమైన జీవితం గడపాలన్నా వైఎస్ జగన్ పాలనలోనే సాధ్యమని వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై, సీఎం వైఎస్ జగన్‌పై ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. ఇలా తెల్లవారకముందే ప్రజలను కలుసుకుని క్షేమ సమాచారం అడిగి తెలుసుకుంటున్న విజయరాజుకు పట్టణ ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు.



అమ్మా ఆశీర్వదించండి అంటూ..



ముస్లిం పెద్దలతో టీ తాగుతూ..

డబుల్ స్పీడ్‌లో వైఎస్సార్ సీపీ

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి
- నడిపల్లి, బాపిరాజుగూడెంలో ప్రచారం

పెదవేగి: దెందులూరు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ డబుల్ స్పీడ్‌లో దూసుకెళుతోందని దెందులూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని నడిపల్లి, బాపిరాజుగూడెం గ్రామాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే విస్తృత ప్రచారం, రోడ్ షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి అబ్బయ్య చౌదరి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరించారు. ప్రజలు అబ్బయ్య చౌదరిపై పూలు చల్లుతూ బాణసంచా కాల్చుతూ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాతా రమ్య, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాపిరాజుగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

సంక్షేమానికి మారుపేరు వైఎస్ జగన్

ఉండి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్

ఉండి: ప్రజాసేవకు, సంక్షేమానికి మారుపేరు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఉండి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. బుధవారం మండలంలోని అర్తమూరు, చెరుకువాడ, కలసిపూడి గ్రామాల్లో బైక్, కార్ ర్యాలీ ద్వారా పీవీఎల్ ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పీవీఎల్‌కు ప్రజలు హారతులు పట్టి అపూర్వ స్వాగతం పలికారు. ఫ్యాన్ గుర్తుకు మీ రెండు ఓట్లు వేయాలంటూ పీవీఎల్ ప్రజలను కోరారు. కలసిపూడిలో సీబీసీ ఎన్‌సీ చర్చ్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కలిసిపూడిలో భ్రమరాంభ మల్లికార్జునస్వామికి పీవీఎల్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ప్రజలకు మేలు చేయాలంటే వైఎస్ జగన్ వల్లే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారన్నారు. చంద్రబాబు, పవన్ ఎన్ని మాయమాటలు చెప్పినా నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. ఈ ఎన్నికల్లో ఉండిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని, దీనిని ఎవ్వరూ అడ్డుకోలేరన్నారు. సర్పంచ్‌లు కేశబోయిన జానకీ శ్రీనివాస్, కొండవేటి సాంబశివరావు, జెడ్పీటీసీ సభ్యులు రణస్తుల కనకదుర్గ మహంకాళి, పార్టీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, కానుబోయిన సత్యనారాయణ, కొండవేటి సత్యనారాయణ, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు కొరపాటి అనిత పాల్గొన్నారు.



కలిసిపూడిలో ప్రచారం చేస్తున్న ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్

జగన్‌పైనే ప్రజలకు నమ్మకం

సీతారామపురంలో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: రాష్ట్రంలో పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అజెండా అని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం సీతారామపురంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వేకువజాము నుంచే గ్రామస్తులతో మాట్లాడుతూ ప్రచారం నిర్వహించారు. అందరినీ పలుకరిస్తూనే తమ ప్రభుత్వాన్ని ఎందుకు మళ్లీ గెలిపించాలో వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి ఉమాబాలను గెలిపించాలని అభ్యర్థించారు. గ్రామంలో పలు చోట్ల ఆయన మాట్లాడుతూ రాజకీయాలు, కులమతాలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, ఆయన అందించిన సుపరిపాలనకు ప్రజలు మద్దతివ్వాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, దొంగ మురళీకృష్ణ, జేవీఆర్, బ్రహ్మాజీ, కస్తూరి రంగ, అడబాల అయ్యప్ప, సయ్యపరాజు వర్మ, చెరుకూరి ప్రసాదరాజు పాల్గొన్నారు.



సీతారామపురం సౌత్ గ్రామంలో ఓట్లు అభ్యర్థిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

పెళ్లింట విషాదం

- రోడ్డుపై గేదె కళేబరాన్ని ఢీకొన్న కారు
- ఘటనా స్థలంలో వధువు తల్లి మృతి

బంటుమిల్లి: మండలంలోని పెందుర్రు గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదం ఓ పెళ్లింట విషాదాన్ని నింపింది. ప్రమాదంలో వధువు తల్లి మృతి చెందగా, వధువుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. నరసాపురం పట్టణానికి చెందిన కైకాల చంద్రలీల (61) కుమార్తె అనూష వివాహాన్ని నరసాపురంలో జరిపించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తల్లీకూతుళ్లు కారులో విజయవాడ నుంచి నరసాపురానికి బయల్దేరారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై పెందుర్రు వద్ద రోడ్డుపై మృతి చెంది ఉన్న గేదెను గమనించని కారు డ్రైవర్ వేగంగా వెళ్లి ఢీకొట్టారు. దీంతో కారు అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లో పల్టీ కొట్టింది. ఈ ఘటనలో చంద్రలీల అక్కడిక్కడే మరణించగా, తీవ్రంగా గాయపడిన అనూష, డ్రైవర్ లోకేష్‌ను పోలీసుల సాయంతో 108 వాహనం ద్వారా మచిలీపట్నం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఏఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రెండురోజుల్లో శుభకార్యం జరగాల్సి ఉండగా చంద్రలీల మృతితో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

కాలువలో పడి వృద్ధుడి మృతి

భీమడోలు: భీమడోలులో గోదావరి కాలువలో ప్రమాదవశాత్తు పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఎస్సై వై.సుధాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దెందులూరు మండలం చల్లచింతలపూడికి చెందిన కొక్కిరాల సుబ్బారావు (64) ఈనెల 20న కుటుంబ సభ్యులకు విజయవాడ వెళుతున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అయితే తండ్రి సుబ్బారావు ఎంతకీ తిరిగి రాకపోవడంతో పెద్ద కుమారుడైన నాగరాజు భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అయితే కనకదుర్గమ్మ ఆలయం వద్ద గోదావరి కాల్వలో సుబ్బారావు మృతదేహం ఉన్నట్లు గుర్తించిన కుమారుడు భీమడోలు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తనిఖీల్లో నగదు పట్టివేత

ఉంగుటూరు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బుధవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఉంగుటూరు చెక్‌పోస్టు వద్ద ఓ వ్యక్తి నుంచి రూ.95వేల నగదు పట్టివేసినట్లు ఉంగుటూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్‌కే ఖాజావలి చెప్పారు. తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వైపు వెళుతున్నా వాహనాన్ని తనిఖీ చేయగా, ఈ నగదు పట్టుబడిందన్నారు. నగదును సీజ్ చేసి ట్రెజరీకి తరలించినట్లు ఆయన తెలిపారు.

వైఎస్సార్ సీపీలోకి వలసల వరద

నరసాపురం: వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పట్టణానికి చెందిన సీనియర్ టీడీపీ నేత షాన్‌వాజ్‌ఖాన్ బుధవారం ముదునూరి సమక్షంలో అనుచరులతో కలిసి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి ముదునూరి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో వామపక్ష పార్టీల్లో కూడా పనిచేసిన షాన్‌వాజ్‌ఖాన్ లాంటి నేత పార్టీలోకి రావడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలు అభివృద్ధి చెందాయన్నారు. కరోనా లాంటి కష్టాలు ఎదురైనా కూడా జగన్ రాజీపడకుండా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి ఈ ఐదేళ్లపాటు విశేష కృషి చేశారని అన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందాలన్నా, రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుండాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పీడీ రాజు, నరసాపురం సొసైటీ అధ్యక్షుడు షేక్ బులిమస్తాన్, బుడితి సుమన్ ఉన్నారు.

నరసాపురం 28వ వార్డు యువకుల చేరిక

పట్టణంలోని 28వ వార్డు నుంచి టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 50 మంది యువకులు ఎమ్మెల్యే ముదునూరి సమక్షంలో బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. యువత పార్టీకి వెన్నుముకలా నిలబడాలని ముదునూరి సూచించారు. పార్టీలో చేరిన వారిలో చిన్న, వెంకటేష్, విజయ్, శ్రీను, వెంకన్న, పండు ఉన్నారు. పార్టీ యూత్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ మెర్లిన్, పట్టణ యూత్ అధ్యక్షుడు ఆబోతు అర్జున్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి.

అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టండి

భీమవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని 4వ వార్డుకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు వార్డు మాజీ కౌన్సిలర్ పేరిచర్ల సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో స్థానిక క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ తన హయాంలోనే భీమవరం నియోజకవర్గ అభివృద్ధి జరిగిందన్నారు. తాను చేసిన అభివృద్ధి పనులు ల్యాండ్ మార్క్‌గా ప్రజలకు కనిపిస్తున్నాయన్నారు. ఇదే నియోజకవర్గంలో పదేళ్లపాటు ఎమ్మెల్యేగా పనిచేసి, ప్రస్తుతం జనసేన అభ్యర్థిగా పోటీలో ఉన్న పులపర్తి రామాంజనేయులు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని శ్రీనివాస్ సవాల్ చేశారు. 2004 ఎమ్మెల్యేగా ఎన్నికైన తాను 126 ఎకరాల భూమిని సేకరించి 60 ఎకరాలలో మహానేత వైఎస్సార్ ప్రోత్సాహంతో రూ.9 కోట్ల ఖర్చుతో భారీ మంచినీటి ప్రాజెక్టును ఏర్పాటుచేసి పట్టణానికి తాగునీటి ఇబ్బంది లేకుండా చేయగలిగానన్నారు. అమృత పథకం మూడో విడతలో రూ.48 కోట్ల నిధులను మంజూరు చేయించి పక్కా ప్రణాళికను సిద్ధం చేసినట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ప్రోత్సాహంతో గడిచిన 58 నెలల కాలంలో నియోజకవర్గంలో సుమారుగా 15 వేల మందికి పైగా ఇళ్ల స్థలాలను మంజూరు చేసి రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను అందించామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రైల్వే అండర్ టన్నెల్స్‌ను నిర్మించినట్లు చెప్పారు. జనసేన అభ్యర్థి అంజిబాబు మంచినీటి పథకం పేరుతో చినఅమిరంలో 50 ఎకరాల భూమిని రైతుల నుంచి తక్కువ ధరకు సేకరించి సొంతానికి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు మోటుపల్లి గంగాధరరావు పాల్గొన్నారు.

వీరవాసరం టీడీపీ, జనసేన నాయకుల చేరిక

భీమవరం: వైఎస్సార్ సీపీలో చేరి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు సేవలు అందించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు బుధవారం రాత్రి స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమానికి ప్రజలు మరోసారి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల కోసం ఒక మాట ఇస్తే దానికి కట్టుబడి పనిచేస్తారని, ఇందులో ఎటువంటి సందేహం లేదని ఈ 58 నెలల పరిపాలనలో నిరూపించారన్నారు. అదే మాదిరిగా ఈనెల 25వ తేదీన ప్రజా ఎన్నికల మేనిఫెస్టోను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విడుదల చేస్తున్నారని తెలిపారు. వీరవాసరం సర్పంచ్ చికిలే మంగతాయారు, నూకల కనకారావు, మానుకొండ ప్రదీప్, కందుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నత్తారామేశ్వరంలో చేరికలు

పెనుమంట్ర: నత్తారామేశ్వరం గ్రామంలో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార పాదయాత్రకు జనం నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు మల్లిడి సత్యనారాయణరెడ్డి, కరుణ దంపతులు ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరి ప్రచార పాదయాత్రలో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో యువత వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచి ప్రచార యాత్రలో పాల్గొన్నారు.

ఆటపాకలో 200 మంది టీడీపీ, జనసేన కార్యకర్తల చేరిక

కైకలూరు: ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ఆటపాకలో పార్టీ తరఫున డీఎన్నార్ సతీమణి దూలం వీరకుమారి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేనకు చెందిన 200 మంది కార్యకర్తలు డీఎన్నార్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఆదర్శవంతమైన పాలనకు ఆకర్షితులై పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్టు పేర్కొన్నారు. ఆటపాకలో రూ.కోట్ల వ్యయంతో అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఏలూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి జగనన్నను తిరిగి ముఖ్యమంత్రి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడవి వెంకటకృష్ణమోహన్, ఎంపీటీసీ సభ్యుడు మంగినేని రామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు పంజా రాంబాబు, గోపవరం సర్పంచ్ ఉలిసి వసంతకుమారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన యువకులతో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



భీమవరంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్



కండువా కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



నరసాపురం సీనియర్ టీడీపీ నేత షాన్‌వాజ్‌ఖాన్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ముదునూరి ప్రసాదరాజు



ఆటపాకలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్